క్లుప్తంగా

స్టీలు కంచాల పంపిణీ



బాలికలకు స్టీలు కంచాలు అందజేస్తున్న సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు

గణపవరం: గణపవరంలోని షిర్డీ సాయిబాబా ఆలయ కమిటీ ఆర్థిక సహాయంతో గణపవరం బాలికల ఉన్నత పాఠశాలకు మధ్యాహ్న భోజన పథకం నిమిత్తం 250 స్టీలు కంచాలను బహూకరించారు. సోమవారం కమిటీ సభ్యులు వేగేశ్న సుబ్బరాజు, వేగేశ్న శ్రీనివాసరాజు, పుల్లంరాజు పాఠశాల హెచ్‌ఎం తోట సింహాద్రి అప్పారావుకు కంచాలను అందజేశారు.

ఎంపీటీసీలకు దక్కని 'గౌరవ' వేతనం

దెందులూరు: స్థానిక సంస్థల ప్రతినిధులకు కూటమి ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనం అందలేదని చల్ల చింతలపూడి ఎంపీటీసీ సింహాద్రి పద్మావతి, మేదినరావుపాలెం ఎంపీటీసీ అంగదాల వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13 నెలలు గడిచినా ఎంపీటీసీలకు ఇచ్చే గౌరవ వేతనం ఇవ్వకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఒక వైపు ప్రోటోకాల్ అమలు చేస్తామని, స్థానిక సంస్థలు బలోపేతం చేస్తామని ప్రజా ప్రతినిధులు ఎవరైనా గౌరవిస్తామంటూ ప్రచార సాధనాల్లో, ప్రసంగాల్లో అద్భుతంగా చెబుతున్న పాలకులు క్షేత్ర స్థాయిలో విఫలం చెందారన్నారు. 13 నెలలుగా గౌరవ వేతనం ఎందుకు ఇవ్వరని అన్నారు. అధికారులను అడిగితే బిల్లులు పెట్టామని చెబుతున్నారని, గౌరవ వేతన బిల్లులను మంజూరు చేయాలని ఎంపీటీసీలు డిమాండ్ చేస్తున్నారు.

రహదారులు ఛిద్రం



భారీ గుంతలతో ఛిద్రంగా మారిన రహదారి

దెందులూరు: సీతంపేట–దెందులూరు గ్రామాల్లో రోడ్ల పరిస్థితి పాదచారులు, వాహనదారులకు తీవ్ర అసౌకర్యంగా మారింది. దీనికి తోడు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గుంటల్లో నీరు నిలిచి ఆ నీటిలో నుంచి వాహనాలు వెళ్లడం ద్వారా గోతులు పడ్డాయని దెందులూరు, సీతంపేట గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు గ్రామాల్లో సమస్యను పరిష్కరించి ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు.

శ్రీవారి సేవలో రాధామనోహర్ దాస్



శ్రీవారి ఆలయంలో వేద పండితులతో రాధామనోహర్ దాస్

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త రాధామనోహర్ దాస్ సోమవారం రాత్రి సందర్శించారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పండితుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు. ఈ సందర్భంగా పండితులు క్షేత్ర చరిత్రను వివరించిన తీరుపై ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు.

వృద్ధుల రక్షణకు చర్యలు తీసుకోవాలి



ఆర్డీవోకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: వృద్ధుల రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం బాపూజీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆర్డీవో ఎంవీ రమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుకునూరి రామచంద్రరావు మాట్లాడుతూ 2007 , 2011 చట్టాలు గురించి వివరించారు. వృద్ధులు గౌరవంగా, భద్రతతో జీవించేలా, వారి ప్రాణ, ఆస్తి రక్షణ కోసం తగు చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను కోరారు. ఈనెల 16న జాతీయ వృద్ధుల కొర్కెల దినోత్సవం సందర్భంగా వినతిపత్రం అందించాల్సి ఉండగా, సెలవుదినం కావడంతో సోమవారం ఆర్డీవోకు వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కె.కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.రాధాకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.త్రినాథరావు, కోశాధికారి ఆర్.రాజేంద్రప్రసాద్, సంయుక్త కార్యదర్శి బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

వ్యాధుల కాలం.. అప్రమత్తత అవసరం

- పరిశుభ్రతతో వ్యాధులు దూరం
- పిల్లల పట్ల జాగ్రత్తలు తప్పనిసరి
- వర్షంలో తడవకుండా చూడాలి



పాఠశాల నుంచి వర్షంలో తడుస్తూ ఇంటికి వెళుతున్న విద్యార్థులు (ఫైల్)

పెదవేగి: ప్రస్తుతం వర్షాకాలం కావడంతో అడపాదడపా వర్షాలు పడడం, ముసురు పట్టి చినుకులు పడుతూనే ఉన్నాయి. చిరుజల్లుల్లో తడవడానికి చిన్నారులు సరదా పడుతుంటారు. కానీ ఆ సరదా మాటున ఎన్నో వ్యాధులు పొంచి ఉన్నాయన్న విషయం వారికి తెలియదు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల ఆరోగ్యం పట్ల చాలా శ్రద్ధ తీసుకోవాలి. సాధారణంగా ప్రాథమిక స్థాయి విద్యనభ్యసించే చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. ఈ వయస్సులో వారు వర్షంలో తడవడం, రోడ్లపై నిల్వ ఉన్న నీటిలో ఆటలాడటం చేస్తుంటారు. దీనికి తోడు రోడ్డు పక్కన, స్కూల్ బయట విక్రయించే చిరుతిళ్లు తినడంపై ఆసక్తి చూపిస్తుంటారు. ఈ అలవాట్లు పిల్లల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. స్కూల్‌కు వెళ్లే పిల్లలకు ఇంటి వద్ద తయారు చేసిన ఆహార పదార్థాలను బాక్సులో పెట్టి ఇవ్వాలి. ముఖ్యంగా తాగునీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలి. దెందులూరు నియోజకవర్గంలో పెదవేగి, దెందులూరు, పెదపాడు, ఏలూరు రూరల్ మండలాల్లో సుమారు 223 వరకూ ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు 18,742 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కానీ చాలా పాఠశాలల్లో శుభ్రమైన తాగునీరు కూడా లభించని పరిస్థితి. దీనికి తోడు అంతంతమాత్రంగా ఉన్న పారిశుద్ధ్యం తదితర సమస్యలతో చిన్నారులు రోగాల పాలు కాకుండా పాఠశాలలో ఉపాధ్యాయులు, ఇంటి వద్ద తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వీధులన్నీ మురికిగా మారి అత్యంత వేగంగా వ్యాధులు వ్యాపించేందుకు అవకాశం ఉంది. పాఠశాలల వద్ద డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం, పాఠశాల ప్రాంగణం అంతా చెమ్మగా మారడం, వర్షపు నీరు నిల్వ ఉండటం తదితర కారణాలతో వ్యాధులు త్వరగా సోకే అవకాశం ఉంది. వర్షంలో తడవడం వలన దగ్గు, జలుబు, డయేరియా, పలురకాల జ్వరాల బారిన పడే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

పాటించవలసిన జాగ్రత్తలు

- సాధ్యమైనంత వరకూ కాచి చల్లార్చిన నీటినే అందరూ తాగాలి.
- పాఠశాలల్లో తాగునీటి ట్యాంకులను తరచూ శుభ్రపరచి, క్లోరినేషన్ చేయించాలి.
- తాజాగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. గిన్నెలపై ఈగలు వాలకుండా మూతలు పెట్టాలి. నిల్వ ఉంచిన ఆహారం ఆరోగ్యానికి ఎంత మాత్రం మంచిది కాదు.
- ఆహారం తినే ముందు, తరువాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి.

జాగ్రత్తలు పాటించాలి

వర్షా కాలంలో మురుగు నీరు, చెత్తాచెదారం నిల్వ ఉన్న చోట ఈగలు, దోమల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. నీటి వలన డయేరియా, మెదడువాపు, మలేరియా, డెంగీ, చికున్ గున్యా తదితర ప్రాణాంతక వ్యాధులు సోకే అవకాశం ఉంది. వర్షంలో తడవడం వలన దగ్గు, జలుబు, కలరా, పలు రకాల జ్వరాలు డయేరియా తదితర వ్యాధుల బారిన పడే ప్రమాదంఉంది. పిల్లల ఆరోగ్యవిషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ ప్రత్యూష, వైద్యాధికారి, ప్రాథమిక వైద్యశాల, పెదవేగి

- మల, మూత్ర విసర్జన అనంతరం చేతులను సబ్బుతో కడుక్కోవాలి.
- పరిసరాల పరిశుభ్రత పాటించాలి. బహిరంగ మూత్ర, మల విసర్జన చేయకూడదు.
- డ్రెయినేజీల్లో నీరు నిల్వ ఉన్న చోట కిరోసిన్, దోమల నివారణ మందులు బ్లీచింగ్ వంటివి చల్లాలి.
- వర్షంలో తడవకుండా గొడుగు, రెయిన్ కోటు వంటి దుస్తులను ధరించాలి.
- పాఠశాలల వద్ద చెత్తాచెదారం నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలి.
- పాఠశాలలో సెప్టిక్ ట్యాంక్‌ల గొట్టాలపై దోమ తెరలు, ఇనుప జల్లెడ ఏర్పాటు చేయాలి.

నులిపురుగుల నివారణకు ట్యాబ్లెట్ల పంపిణీ

దెందులూరు: పోతునూరు పీహెచ్‌సీ పరిధిలో 2714 నులిపురుగుల నివారణకు ట్యాబ్లెట్లను పంపిణీ చేశామని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఐ.ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం పోతునూరు పీహెచ్‌సీలో ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో 8 సచివాలయాల్లో 14 గ్రామాల్లో 31 అంగన్‌వాడీ కేంద్రాలు, నాలుగు హైస్కూళ్లు, 21 ప్రాథమిక పాఠశాలు, ఒక ఇంటర్ కళాశాల, రెండు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు వైద్య అంగన్‌వాడీ సిబ్బంది ట్యాబ్లెట్లను వేశారు. ఎంపీహెచ్‌ఓ ప్రభాకర్ రావు, సూపర్‌వైజర్ హరి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు సమష్టిగా నులిపురుగుల నివారణ ట్యాబ్లెట్ల పంపిణీని పర్యవేక్షించారు.

ఎంఈవో–2గా యర్రంశెట్టి

నిడమర్రు: నిడమర్రు ఎంఈవో–2గా యర్రంశెట్టి శేషగిరిరావు సోమవారం ఎంఈవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ భీమడోలు మండల ఎంఈవో–2గా ఉన్న భాస్కర్‌కుమార్‌కు నిడమర్రు మండల ఎంఈవో–2గా అదనపు విధుల్లో పని చేశారు. ఆయన స్థానంలో చానమిల్లి గ్రేడ్–2 హెచ్‌ఎంగా పని చేస్తున్న శేషగిరిరావును ఎంఈవో–2 ఎఫ్ఏసీగా ఉన్నతాధికారులు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నేతలు నిమ్మల జయప్రకాశ్ నారాయణ, అడబాల అప్పారావు, ఐవీ ప్రసాద్, కంచం రామకృష్ణ, ఎంఈవో కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న మహిళా కానిస్టేబుల్ లక్ష్మీసుజన

భీమడోలు: రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తే సురక్షిత ప్రయాణం సాధ్యమని ఎంఎంపురం జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం డాక్టర్ పీవీకేడీ ప్రసాద్ అన్నారు. పూళ్ల పంచాయతీ పరిధిలోని ఎంఎంపురం ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థినీ విద్యార్థులకు ట్రాఫిక్ నియమావళిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన హెచ్‌ఎం పీవీకేడీ ప్రసాద్ మాట్లాడుతూ మితిమీరిన వేగం వల్లే ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమ నిబంధనలను అనుసరిస్తే ప్రయాణం సాఫీగా జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలను నడపరాదన్నారు. సచివాలయం నెం.3 మహిళా కానిస్టేబుల్ లక్ష్మీ సుజన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో కుటుంబ యాజమాని చనిపోతే ఆ కుటుంబం అన్ని విధాలుగా నష్టపోతుందని, ఆ కుటుంబ రోడ్డున పడుతుందన్నారు. విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని, అదే విధంగా తమ తల్లిదండ్రులకు నియమ నిబంధనలు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

దెందులూరు: రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. సోమవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మెరుపులతో వర్షం పడేటప్పుడు పొలాల్లో, విద్యుత్ స్తంభాలు, సెల్‌ఫోన్ టవర్లు, చెట్లు, బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదన్నారు. ప్రతి ఒక్కరూ భవనాల్లో సురక్షితమైన ప్రాంతాల్లో ఉండాలన్నారు. పలుచోట్ల పిడుగులు పడే అవకాశం ఉందని ఏపీ విపత్తుల సంస్థ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని శాఖల అధికారులు, ఉద్యోగుల సెలవులు రద్దు చేశామన్నారు. గ్రామాల్లో ఉద్యోగులు ఎప్పటికప్పుడు తుఫాను నష్టాల పరిస్థితులపై మండల అధికారులకు సమాచారాన్ని అందజేయాలన్నారు. పర్యవేక్షణ అధికారులు నిరంతరం ఫోన్ చేస్తారని ముఖ్యంగా రాత్రి వేళల్లో ఫోన్ చేసినప్పుడు స్పందించాలన్నారు. తుఫానుకు సంబంధించి హెచ్చరిక సమాచారాన్ని వీఆర్‌ఓలు, వీఆర్ఏలు, రేషన్ డీలర్లు విస్తృతంగా గ్రామ శివారు ప్రాంతాల్లో ప్రచారం చేయాలని తహసీల్దార్ సూచించారు.

వైభవంగా శ్రీనివాసుని కల్యాణం



శ్రీనివాసుని కల్యాణం నిర్వహిస్తున్న ద్వారకాతిరుమల రుత్వికులు

ఉంగుటూరు: హరినామ కీర్తనలు, గోవింద నామ స్మరణలతో నాచుగుంట మారుమోగింది. సోమవారం ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం డాక్టర్ సుంకవల్లి గో–వ్యవసాయ విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో నాచుగుంట గోపాలకృష్ణ గోశాల వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా నాచుగుంట రైల్వే గేట్ మొదలుకొని ప్రజలు, భక్తులు పాల్గొని హరినామ స్మరణ చేశారు. ద్వారకాతిరుమల నుంచి వచ్చిన ప్రత్యేక స్వామి వారి రథానికి భక్తులు స్వాగతం పలికారు. ద్వారకాతిరుమల ఆలయ సూపరింటెండెంట్ హయగ్రీవాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణం వైభవంగా నిర్వహించారు. వచ్చిన భక్తులకు గోశాల నిర్వాహకులు పరిమి రాఘవులు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సౌకర్యాలు ఏర్పాటు చేసి, ప్రసాద వితరణ చేశారు. కల్యాణం నిర్వహించిన రుత్వికులను గోశాల కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అల్లాడ సత్యనారాయణ, నారాయణ సత్తిపండు, సుంకవల్లి రాఘవేంద్రరావు, జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బంజారాల తీజ్ పండుగ



తీజ్ పండుగను నిర్వహిస్తున్న బంజారాలు

చింతలపూడి: బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో నామవరం గ్రామంలో తీజ్ పండుగను ఘనంగా నిర్వహించారు. తీజ్ బుట్టలను ఆడపిల్లలు ఎత్తుకొని తీన్మార్ డప్పులతో, సాంస్కృతిక బంజారా నృత్యాలతో ఊరంతా ఊరేగించుకుంటూ గ్రామ చెరువులో నిమజ్జనం చేశారు. నవరాత్రులు తీజ్ దీక్ష చేసిన ఆడబిడ్డలకు బంజారా భజరంగీ బేరి కమిటీ నాయకులు నూతన వస్త్రాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు భూక్యా నాగరాజు నాయక్ మాట్లాడుతూ గోర్ బంజారాలు జరుపుకునే తీజ్ పండుగ శాస్త్రీయమైన సాంప్రదాయ వ్యవసాయ పండుగ అని అన్నారు. వెదురు బుట్టల్లో నవధాన్యాలు ఆడ బిడ్డలతో వేయించి, వాటిలో ఏ విత్తనం మొలకలు బాగా వస్తాయో ఆ పంటలు వేసుకునే ప్రయోగాత్మక వ్యవసాయ పండుగ అని అన్నారు. సంఘ అధ్యక్షుడు భూక్యా శ్రీనివాస్ నాయక్ , సంఘ ప్రధాన కార్యదర్శి ప్రేమ్ చంద్ నాయక్, భూక్యా వేణుగోపాల్, ధరావత్ రవి, మూడు సోని, పుష్ప, లక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

ఉంగుటూరు: మండలంలోని చేబ్రోలు శివారులో పేకాట ఆడుతున్న వారిపై ఆకస్మికంగా దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చేబ్రోలు ఎస్సై సూర్య భగవాన్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.22,900 స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. వీరిని కోర్టులో హాజరు పరుస్తామన్నారు. మండలంలో పేకాట ఎక్కడ ఆడినా ఉపేక్షించేది లేదని ఎంతటి వారైనా అరెస్టు చేస్తామని ఎస్సై తెలిపారు.

తాగునీటి సమస్యతో అవస్థలు



లక్కవరం మసీదు సమీపంలో ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంకర్

జంగారెడ్డిగూడెం: తాగునీటి కోసం లక్కవరం గ్రామంలోని రెండవ వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 15వ తేదీన మంచినీటి ట్యాంకుకు సంబంధించిన మోటార్ స్టార్టర్ కాలిపోయింది. దీంతో వెంటనే సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డుసభ్యులు జోక్యం చేసుకుని కొత్త స్టార్టర్ తెచ్చి మంచినీటి సరఫరా పునరుద్ధరించారు. అయితే ఆ తరువాత మోటార్ కాలిపోయి రెండవ వార్డులోని సుమారు 7 వీధులకు మంచినీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో గత మూడు రోజులుగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. కొద్ది కాలంగా మంచినీటి సమస్య తలెత్తుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ప్రజా ప్రతినిధుల జోక్యంతో మంచినీటి ట్యాంకు ఏర్పాటు చేశారు. మసీదు సెంటర్ వద్ద పెట్టి చుట్టుపక్కల వీధుల్లోని ప్రజలను అక్కడికి వచ్చి నీరు పట్టుకోవాలని చెప్పడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతదూరం నీళ్లు మోయలేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు.

ముంపు నీటిలోనే పంట పొలాలు

- అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వానలకు తీవ్ర నష్టం
- రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి



ఉంగుటూరు: దొంతవరం ఆయకట్టులో మునిగిన పంట చేలు

ఉంగుటూరు: వర్షం కురిసి అయిదురోజులు పూర్తి కావొచ్చినా ఇంక పంటచేలు ముంపులోనే ఉన్నాయి. నీరులాగలేదు. ముంపులోనే వరిపొలాలు ఉన్నాయి. దుబ్బులు కుళ్ళిపోతాయని డెల్టాగ్రామాల రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు చేసిన సూచనలు కూడా నీరు లాగాకే ఫలించనున్నాయి. కానీ ఇప్పటికీ అయిదు రోజులు పూర్తయినా నీరు లాగకపోయే సరికి రైతులు ఆందోళనలో ఉన్నారు. డెల్టాలోని వీఏ పురం, రామాపురం, కాకర్లమూడి, దొంతవరం, రావులపర్రు, గ్రామ ఆయకట్టు ప్రాంతంలో వర్షం నీరు లాగక పంట పొలాలు సముద్రాన్ని తలపించేలా నీరు కనిపిస్తోంది. ఈ నీరు లాగేదెపుడు పంటచేలు తేరుకునేదెపుడని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాలను ఆనుకొని ఉన్న మురుగుకోడులను ఆక్రమించడంతో వర్షం నీరు పారక పంట పొలాలు మునిగిపోతున్నాయి. దీనికి తోడు డ్రెయినేజీ శాఖ అధికారులు ఆ మురుగు కోడులు తవ్వించే ప్రయత్నాలు చేయకపోవడం కూడా కారణంగా కనిపిస్తుంది.

తేరుకున్నాక వరికి సూచనలు

ఉంగుటూరు: ముంపు నుంచి తేరుకున్న పొలాలకు బూస్టర్ డోసుగా యూరియా పొటాష్ వేయాలని ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.నాగేంద్రబాబు అన్నారు. సోమవారం ఉంగుటూరు మండలంలో ముంపుకు గురైన పంట పొలాలను ఏలూరు ఏరువాక కేంద్ర సమన్వయ కర్త డాక్టర్ కె.ఫణికుమార్, శాస్త్రవేత్త ఎస్.నాగేంద్రబాబు, మారుటేరు శాస్త్రవేత్తలు డాక్టర్ పీవీ రమణరావు (ప్లాంటు బ్రీడింగు) డాక్టర్ ఎ.ఆనందకుమార్ (కీటక శాస్త్రం) పరిశీలించారు. తహసీల్దార్ పూర్ణచంద్ర ప్రసాదు, మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో కాకర్లమూడి, వీఏ పురం, దొంతవరం, రావులపర్రు, గ్రామ ఆయకట్టు ముంపు పొలాలను శాస్త్రవేత్తల బృందం సభ్యులు పరిశీలించారు. ఆయా గ్రామాల్లో రైతులతో శాస్త్రవేత్తలు మాట్లాడుతూ 20 నుంచి 30 రోజుల కాల పరిమిత గల నాట్లుగా గుర్తించామని తెలిపారు. వర్షాలు తగ్గాక పొలాల్లో నీరు బయటకు పంపించి ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోలు పొటాష్‌ను వేయాలని రైతులకు తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగంగా కార్బెండజిమ్ తెగులు మందును ఒక గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. అగస్టు 13వ తేదీ నుంచి కురుస్తున్న వర్షాలకు రంగరావు కోడు, సంతకోడు, పదకోడు, పందికోడు, లింగం కోడు, ఆళ్ళ కోడులు నీరు లాగక పంటచేలు మునిగిపోయాయని రైతులు అధికారులకు వివరించి ఆందోళన వ్యక్తం చేశారు.

జోరు వానతో ముంపుబారిన పొలాలు

భీమడోలు: అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వరి పొలాలు ముంపుబారిన పడుతున్నాయి. రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరు కిందకు వెళ్లే మార్గం లేక చేలల్లోనే నిల్వ ఉండి వరి నాట్లు ముంపుకు గురైయ్యాయి. కొల్లేరు అనుకున్న ప్రాంతాలయిన పూళ్ల, గుండుగొలను, పూళ్ల ఏరియాల్లో చుట్టూ చేపల చెర్వులు విస్తరించడం, డ్రైనేజ్ వ్యవస్థ అధ్వాన్నంగా ఉండడంతో నీరంతా పొలాల్లో చేరడంతో వరి నాట్లు కుళ్లిపోతున్నాయి. దీనితో రైతులు వేలాది రూపాయల పెట్టుబడితో వేసి నాట్లు దెబ్బతింటున్నాయని వారు గగ్గోలు పెడుతున్నారు. ప్రతి ఏటా సార్వాలో ఇదే పరిస్థితులతో నానా అవస్థలు పడుతున్నా, సంబంధిత అధికారులు పట్టనట్లు వ్యవహారిస్తున్నారని, శాశ్వత పరిష్కారం చూపడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనితో రైతులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత వ్యవసాయ శాఖ సిబ్బందికి మొరపెట్టుకున్నారు. దీనితో వ్యవసాయాధికారి ఉషారాణి మునిగిన వరి నాట్లు సోమవారం పరిశీలించారు. మండల వ్యాప్తంగా 525 ఏకరాల విస్తీర్ణంలోని వరి నాట్లు మునిగాయని తెలిపారు. ఇంకా పలు గ్రామాల్లో పంట చేలు మునిగాయి. రైతులు పడుతున్న ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్తానని వారికి తెలిపారు. రైతులకు వరి నాట్లు దెబ్బతినకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు. మరో రెండు, మూడు రోజుల పాటు భారీ వర్షాలు పడతాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేయడంతో రైతులు మరింత ఆందోళనచెందుతున్నారు.

ఏకధాటిగా వర్షం

సోమవారం ఉదయం నుంచి మండల వ్యాప్తంగా వర్షం కురవడంతో జన జీవనం స్తంభించింది. పలు పనుల నిమిత్తం బయటకు వచ్చే పరిస్థితులు లేక ఇళ్లకే పరిమితమయ్యారు. అత్యవసర పనులను వర్షంలో తడుస్తూ పనులు పూర్తి చేసుకున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు వర్షంలోనే తమ విధులను నిర్వర్తించారు. అయితే వర్షానికి భీమడోలు బస్టాండ్ అధ్వానంగా మారింది. బస్సులు ఎక్కేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్త్రీశక్తి పథకం అమలు చేసిన నాటి నుంచి బస్సులు తగ్గించడంతో వచ్చే అరకొర బస్సులను ఎక్కేందుకు మహిళలు పోటీ పడుతున్నారు. లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి.



ఉంగుటూరు: కాగుపాడు ఆయకట్టు రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు



భీమడోలు: పూళ్ల ఏరియాలో మునిగిన వరి నాట్లను చూపుతున్న రైతు



భీమడోలు: పూళ్లలో మునిగిన వరి నాట్లను పరిశీలిస్తున్న ఏవో ఉషారాణి

దివ్యాంగుల పింఛన్ల కుదింపునకు కుట్ర

భీమడోలు: రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగుల పింఛన్లు తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, వెంటనే ఉపసంహరించుకోవాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మామిడిపల్లి నాగభూషణం అన్నారు. గతంలో సదరం ధృవీకరణ పత్రాల ఆధారంగా అర్హత గల దివ్యాంగులకు పింఛన్లు అందించేవారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కొత్తగా సదరం శిబిరాలను ఏర్పాటు చేసి, రీఅసెస్‌మెంట్ చేసి శారీరక వైకల్యానికి సంబంధించిన ధృవీకరణ పత్రాలను అందిస్తున్నారన్నారు. అయితే వైద్యులు 90 శాతం వైకల్యం ఉన్నట్లయితే 60 శాతం, 60 శాతం వైకల్యం ఉన్నట్లయితే 40 శాతం నమోదు చేశారన్నారు. దీని వలన పూర్తి పింఛన్‌కు అర్హత ఉన్న లబ్ధిదారుల సంఖ్య తగ్గుతుందన్నారు. దీంతో పింఛన్‌పై ఆధారపడిన దివ్యాంగుల కుటుంబాలు రోడ్డున పడతాయని, వారికి తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ఇలాంటి విధానాలను వెనక్కి తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

ప్రయాణం ప్రమాదకరం

లింగపాలెం: వర్షాలకు లింగపాలెం మండలంలోని ఏలూరు– చింతలపూడి వెళ్లే ప్రధాన రహదారి పలు చోట్ల గోతులు పడి వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. దీంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా ధర్మాజీగూడెంలో ప్రధాన రహదారిపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో ద్విచక్రవాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిపై ఉన్న గోతులను పూడ్చించి ప్రమాదాలను నివారించాలని పలువురు కోరుతున్నారు.